
బ్రూసెల్లోసిస్ కలకలం..! 2




శివాలయంలో దొంగతనం 3



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com


## ధాన్యం కొనుగోళ్లలో సమస్యలను పరిష్కరించాలి



**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలో ధాన్యం కొనుగోళ్లలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వరి కోతలు ప్రారంభమై 60 రోజులు గడుస్తున్నా, ఇప్పటికీ కొనుగోళ్లు పూర్తికావట్లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు నవీన్, కిసాన్ మోర్చా నాయకులు నర్సయ్య, చిన్నయ్య, రవి పాల్గొన్నారు.



**ఆరుగాలం కష్టపడి ధాన్యం పండించిన అన్నదాతకు అరిగోస తప్పడంలేదు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన కర్షకులకు కష్టాలే ఎదురవుతున్నాయి. ధాన్యం సేకరణ కేంద్రాల్లో నత్తనడకన కొనుగోళ్లు జరగడంతో అవస్థలు పడుతున్నారు. ధాన్యం అమ్ముడు పోక, చేతికి డబ్బులు రాక రైతులు ఆందోళన చెందుతు న్నారు. ఉదయం నుంచి రాత్రివరకు రైతులు కొనుగోలు కేంద్రాల చుట్టూ తిరుగుతున్నా రోజుకో కారణం చెబుతూ కొనుగోళ్లు వాయిదా వేస్తున్నారు. ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు నిత్యం ఎక్కడో ఓ చోట రోడ్డెక్కుతు న్నారు. ఆగ్రహంతో అక్కడక్కడ అన్నదాతలు ధాన్యానికి నిప్పపెడుతున్నారు.**

– అక్షరటుడే, కామారెడ్డి



# అన్నదాత ఆగ్రహ జ్వాల

- ధాన్యం నిల్వలపై కట్టలు తెంచుకుంటున్న రైతన్నల ఆగ్రహం
- కాంటాలు చేయడం లేదని రోడ్డెక్కుతున్న వైనం
- కొనుగోలు పూర్తికాక ఆగ్రహంతో ధాన్యానికి నిప్పు పెట్టిన కర్షకులు

కామారెడ్డి జిల్లాలో రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. దళారులను నమ్మి మోసపోవద్దని చెబుతున్న అధికారులు రైతుల ధాన్యం తరలింపునకు సరిపడా ట్రాన్స్‌పోర్ట్, లేబర్‌ను ఏర్పాటు చేయడంలో విఫలం అవుతున్నారు. దీంతో రైతన్నలు ప్రతిరోజూ ఏదో ఒక చోట రోడ్డెక్కి ధర్నాలు చేయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. తాజాగా రామారెడ్డి మండలం ఇసన్నపల్లి గ్రామానికి చెందిన రైతు ధాన్యం 40 రోజులుగా కొనుగోలు కేంద్రంలోనే నిల్వ ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన తన ధాన్యానికి నిప్పు పెట్టడం చర్చనీయాంశంగా మారింది.

### రైతుల ఆగ్రహం

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జాప్యంతో కామారెడ్డి జిల్లా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకుందామని కేంద్రాలకు తెస్తే, వారాల తరబడి కాంటా కోసం ఎదురుచూడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు నెల రోజుల పాటు కొనుగోలు కేంద్రాల్లోనే ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నా ధాన్యం త్వరగా వెళ్లిపోవాలని రైతులు కేంద్రాల్లోనే పడిగాపులు కాస్తున్నారు. అయినా అధికారుల నిర్లక్ష్యంతో ధాన్యం నిల్వలు ఉండడంతో రైతన్నల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది.

### జిల్లా వ్యాప్తంగా నిరసనలు

జిల్లాలోని పలు మండలాల్లో కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు తిష్ట వేస్తున్నాయి. కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లోని పలు కేంద్రాల దగ్గర రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారు. ధాన్యం తీసుకెళ్లండి మహాప్రభో అంటూ అధికారులను వేడుకుంటున్నారు. వానాకాలం పంట డబ్బులు చేతికందితేనే యాసంగి సాగుకు పెట్టుబడి వస్తుందని, అప్పులు తీరుతాయని రైతులు చెబుతున్నారు.

### లేబర్ సమస్య అంటున్న అధికారులు

కొనుగోలు కేంద్రాల్లో జాప్యానికి అసలు కారణం లేబర్ కొరత, లారీలు దొరకడం లేదని అధికారులు సమాధానం చెబుతున్నారు. అయితే కొనుగోలు కేంద్రాలు పెట్టే ముందే లారీలు, హమాలీలు, గోనె సంచులు ఎందుకు సిద్ధం చేసుకోలేదని రైతులు ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నిస్తున్నారు. ప్రతి ఏడాది ఇదే సమస్య పునరావృతమవుతోంది. కేంద్రాలు ప్రారంభించే నాటికే ఎంత ధాన్యం వస్తుందో అధికారులకు ఓ అంచనా ఉంటుంది. దానికి తగ్గట్టు రవాణా, నిల్వ ఏర్పాట్లు ముందుగానే చేసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉంటుంది. అయినా అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టుగా కనిపిస్తుందని రైతులు ఆరోపిస్తున్నారు.

### కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటన

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న సమస్యలపై కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆరా తీస్తున్నారు. క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాల వద్దకు వెళ్లి స్వయంగా పరిశీలిస్తున్నారు. రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. లేబర్ కొరత లేకుండా చూస్తామని రైతులకు భరోసా కల్పిస్తున్నారు. దాంతో రైతుల్లో కాస్త ఉపశమనం నెలకొంటుంది.



### కాంటా కాగానే ట్రక్ షీట్ ఇవ్వాలి



కొనుగోలు కేంద్రాల్లో రైతుల బాధ ఎవరికి చెప్పుకోలేనిది. కాంటా కాగానే ధాన్యం తరలించడంలో జాప్యం జరుగుతోంది. లారీల సరఫరా కోసం వేసిన టెండర్లపై అధికారుల పర్యవేక్షణ ఉండాలి. సకాలంలో లారీలు రావాలి. కాంటా కాగానే కొనుగోలు కేంద్రంలోనే రైతుకు ట్రక్ షీట్ ఇవ్వాలి.

– విఠల్ రెడ్డి, భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు

### డబుల్ ప్రెషర్‌తో ఆలస్యం

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో కామారెడ్డి జిల్లా మూడో స్థానంలో ఉంది. ఏప్రిల్, మే రెండు నెలల్లో ధాన్యం సేకరించాల్సి ఉన్నా కేవలం ఒక్క నెలలోనే ఎక్కువ అవుతోంది. దాంతో ప్రెషర్ ఎక్కువై లారీల రాకపోకలు ఆలస్యం అవుతున్నాయి. హమాలీల కొరత కూడా ధాన్యం సేకరణకు ఆలస్యమైంది. జిల్లాలో మొత్తం 4 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించాల్సి ఉండగా ఇప్పటివరకు 3.14 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తయింది. సేకరించిన ధాన్యానికి సంబంధించి ఇప్పటివరకు రూ.653 కోట్లు ట్యాబ్ ఎంట్రీ పూర్తి కాగా రూ.602 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేయడం జరిగింది.

- వెంకటేశ్వర్లు, డీసీఎస్‌వో, కామారెడ్డి



## పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో ఉన్న పెండింగ్ కేసుల దర్యాప్తులో వేగం పెంచాలని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల వద్ద నిరంతర తనిఖీలు చేపట్టి సిబ్బందికి తగిన సూచనలు ఇవ్వాలని స్పష్టం చేశారు. కోర్టు ట్రయల్‌లో ఉన్న కేసులపై సమీక్ష నిర్వహించిన ఆయన, ప్రతి కేసులో సాక్షులు, ముద్దాయిలకు సమన్లు తప్పనిసరిగా అందేలా చూసి నేరస్తులకు త్వరగా శిక్ష పడేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలన్నారు. జిల్లాలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కార్యకలాపాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వారిపై గట్టి నిఘా ఉంచాలని, వారి వివరాలను అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ఈ నెలలో నమోదైన కేసులను సమీక్షించి, త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.

## కొనుగోలు కేంద్రాలకు లారీలు.. అక్షర టుడే కథనానికి స్పందన



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీల కొరతతో రైతులు పడుతున్న ఇబ్బందులపై 'అక్షరటుడే'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం హాజీపూర్, రుద్రారం, అడివిలింగాల్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహశీల్దార్ ప్రేమ్ కుమార్ సందర్శించి ధాన్యం బస్తాలు తరలించేందుకు లారీలను ఏర్పాటు చేశారు. కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయని, లారీలు సకాలంలో రాకపోవడంతో కొనుగోళ్లు నిలిచిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కుప్పలుగా పోసిన ధాన్యం వర్షానికి తడిసే ప్రమాదం ఉందని, త్వరితగతిన లారీలను పంపించాలని కోరారు. ఎక్కువ సంఖ్యలో లారీలను ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని అధికారులకు వివరించారు. రైతుల కష్టాలను 'అక్షరటుడే'లో 'లారీలు రావు.. ధాన్యం పోదు..' శీర్షికతో కథనం ప్రచురించగా స్పందించిన ఆర్డీవో, జిల్లా అధికారులు వెంటనే చర్యలు చేపట్టారు. హుటాహుటిన లారీలను ఏర్పాటు చేసి హాజీపూర్, రుద్రారం, అడివిలింగాల్ కొనుగోలు కేంద్రాలకు పంపించారు. లారీలు రావడంతో కేంద్రాల్లో నిలిచిపోయిన ధాన్యం తరలింపు ప్రక్రియ మళ్లీ ప్రారంభమైంది. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణ పరిష్కారానికి కృషి చేసిన 'అక్షర టుడే'కు, స్పందించిన అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## తుది దశకు చేరిన ధాన్యం సేకరణ ప్రక్రియ: కలెక్టర్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లాలో యాసంగి 2026 సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ తుది దశకు చేరిందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. మరో వారం రోజుల్లో సేకరణను పూర్తి చేసేలా చర్యలు చేపట్టామని వెల్లడించారు. ప్రభుత్వం తరపున ధాన్యం సేకరణ కోసం ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా ఆధ్వర్యంలో ఈసారి జిల్లాలో మొత్తం 739 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 6.30లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తయ్యిందని, సుమారు రూ.1,500 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించగా, రైతుల ఖాతాల్లో రూ.1,320 కోట్లు జమా అయినట్లు వివరించారు. ధాన్యం సేకరణ పూర్తయిన ప్రాంతాల్లో ఇప్పటికే 430 కొనుగోలు కేంద్రాలను మూసివేసినట్లు తెలిపారు. ఇంకా మిగిలిన కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 40వేల నుంచి 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని, మరో వారం రోజుల్లో నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా కొనుగోళ్లు పూర్తి అవుతాయని పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో వరి కోతలు ఆలస్యంగా జరుగుతున్న కారణంగా ఇప్పుడిప్పుడే దిగుబడులు వస్తుండటంతో, అలాంటి ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. కాగా.. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల అన్‌లోడింగ్ పాయింట్ల వద్ద రైతులు, హమాలీల కోసం ఫస్ట్ ఎయిడ్ కిట్లు, తాగునీటి సదుపాయం, ఓఆర్ఎస్ సాచెట్లు, మజ్జిగ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కొన్ని రైస్‌మిల్లుల వద్ద మధ్యాహ్న సమయంలో ఉచిత భోజన సదుపాయం కూడా కల్పిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ధాన్యం సేకరణ చివరి దశలో రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిందని తెలిపారు.



## ప్రజలను ఆధ్యాత్మికత వైపు నడిపిస్తున్న సంస్థ 'ఆర్ట్ ఆఫ్ లివింగ్'

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఆరోగ్యంతో పాటు ఆధ్యాత్మిక వైపు నడిపిస్తున్న సంస్థ 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' అని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. సంస్థ ఫౌండర్ రవిశంకర్ నేతృత్వంలో బెంగుళూరులో కొనసాగుతున్న 45వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ధ్యానం, యోగా, సత్సంగ్, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వార్షికోత్సవ వేడుకలతో పాటు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండర్ రవిశంకర్ 70వ జన్మదినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రపంచవ్యాప్తంగా 180 దేశాల్లో 10వేలకు పైగా కేంద్రాలను 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' సంస్థ నడిపిస్తోందన్నారు. ఆధ్యాత్మికవేత్త రవిశంకర్ అనేక ఆశ్రమాలను నెలకొల్పడమే కాకుండా భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు.








## మెడికల్ షాప్‌ల బంద్ ప్రశాంతం..

ఆన్‌లైన్‌లో మందుల విక్రయాలను నిరసిస్తూ దేశవ్యాప్త నిరసనలో భాగంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మెడికల్ షాప్‌ల బంద్ ప్రశాంతంగా ముగిసింది. కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి మెడికల్ షాపులను మూసివేసి నిర్వాహకులు నిరసన తెలిపారు. ఆన్‌లైన్ విధానం కారణంగా నకిలీ మందులు విచ్చలవిడిగా రోగులకు సరఫరా అవుతున్నాయన్నారు. చిన్న మెడికల్ షాప్‌లకు ఆర్థిక కష్టాలు వస్తున్నాయని వాపోయారు.

– అక్షరటుడే, నెట్‌వర్క్



## ఈదురు గాలుల బీభత్సం.. నేలకొరిగిన వరి..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలో రెండు రోజుల క్రితం ఈదురు గాలులు, అకాల వర్షం బీభత్సం సృష్టించాయి. గంటకు 50కి.మీ నుండి 60 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులకు వరి పంట నేలకొరిగింది. కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలాలు, కుప్పలుగా పోసిన ధాన్యం పూర్తిగా తడిసిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈదురు గాలులకు తోడు కురిసిన భారీ వర్షానికి పొలాల్లోని పంట తడిసి ముద్దయింది. కల్లాల్లో, రోడ్ల పక్కన ఆరబోసిన ధాన్యం కొట్టుకుపోయింది. తడిసిన ధాన్యం రంగు మారి మొలకెత్తే ప్రమాదం ఉండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతికి వచ్చిన పంట నేలకొరకడంతో పెట్టుబడులు కూడా దక్కవేమోనని ఆందోళన చెందుతున్నారు. గాలుల ధాటికి ఎల్లారెడ్డి - కామారెడ్డి రహదారిపై భారీ వృక్షాలు నేలకూలాయి. విద్యుత్ స్తంభాలు, లైన్లు తెగిపడడంతో కొత్తపల్లి, తిమ్మాపూర్, హాజీపూర్, హాజీపూర్ తండా, బాలాజీ నగర్, అడవిలింగాలు, పోచంపల్లి, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలోని పలు వార్డులు అంధకారంలోకి వెళ్లాయి. రాత్రంతా ప్రజలు చీకట్లోనే గడపాల్సి వచ్చింది. తాగునీటి సరఫరాకు కూడా అంతరాయం ఏర్పడింది. రోడ్లపై చెట్లు పడడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.





## ఆలయ భూమిలో అక్రమ నిర్మాణం ఆపాలని వినతి

**అక్షరటుడే, బాల్కొండ:** మండల కేంద్రంలోని గుట్టమీద ఆంజనేయ ఆలయ భూమిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు కోరారు. ఈ మేరకు జీపీ సర్పంచ్, సెక్రెటరీ, పాలకమండలికి వారు వినతిపత్రం అందజేశారు. ఆలయ భూమిలో 1,382 సర్వే నంబర్‌తో ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి అక్రమ నిర్మాణానికి ప్రయత్నిస్తున్నారని ఇద్దరు వ్యక్తులపై పిర్యాదు చేశారు. కోర్టు ఉత్తర్వులు వచ్చే వరకు ఎలాంటి నిర్మాణ పనులకు అనుమతులు ఇవ్వకూడదని కోరారు. కార్యక్రమంలో గుట్టమీద హనుమాన్ కమిటీ, వీడీసీ సభ్యులు గుండ్రత్తి నడిపి పోశెట్టి, కుమ్మరి గంగాధర్, రవి, గోపు గంగాధర్, కద్దల్ పెద్ద రాజేశ్వర్, పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



## లీగల్ మెట్రాలజీ నిబంధనల సవరణపై నిఘా అవసరం..

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** లీగల్ మెట్రాలజీ నిబంధనల సవరణల ప్రతిపాదనలపై నిరంతరం నిఘా అవసరమని భారతీయ వినియోగదారుల మండలి రాష్ట్ర కార్యదర్శి సందు ప్రవీణ్ అన్నారు. అంతర్జాతీయ లీగల్ మెట్రాలజీ డే సందర్భంగా పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి శ్రీకాంత్ రెడ్డి (DSO), ఏఎస్‌వో అరవింద్ రెడ్డి ఆధ్వర్యంలో పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సందు ప్రవీణ్ మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో మోసాలను కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సూపర్ మార్కెట్లు, కూరగాయలు, చేపల మార్కెట్లు, బంగారు దుకాణాల్లో నిత్యం వందలసార్లు తూకాలు వాడుతుంటారని వాటిలో చిన్నపాటి తేడాలు కూడా వినియోగదారులను నష్టపరుస్తాయన్నారు. ఈ మోసాలను అరికట్టేందుకు లీగల్ మెట్రాలజీ అధికారులు ఏటా తనిఖీలు నిర్వహించి తూకాలను సరిచేసి స్టాంపింగ్ వేయడం ఎంతో అవసరమని ఆయన స్పష్టం చేశారు. అయితే లీగల్ మెట్రాలజీ అధికారుల తనిఖీల కాలపరిమితిని ఒక ఏడాది నుంచి మూడు లేదా ఐదేళ్లకు పెంచాలని ప్రతిపాదిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండలి ఉపాధ్యక్షుడు వీఎన్ వర్మ, కోశాధికారి మహాదేవుని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



ఏపీలోని కర్నూలు జిల్లా బనవాసి సెమన్ బ్యాంక్‌లో ప్రమాదకరమైన 'బ్రూసెల్లోసిస్' వ్యాధి కలకలం రేపింది. ఈ నేపథ్యంలో నిజామాబాద్ జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, పాడి రైతులు తీవ్ర అప్రమత్తమవ్వాల్సిన అవసరం ఏర్పడింది. బనవాసి కేంద్రంలో ఒకేసారి ఎనిమిది పశువులకు ఈ వ్యాధి నిర్ధారణ కావడం, వాటి సంరక్షణ చూసే ఇద్దరు కూలీలకు సోకడం ఆందోళన కలిగిస్తోంది. ఈ వ్యాధి పశువుల నుంచి మనుషులకు వేగంగా వ్యాపించే (జూనోటిక్) ముప్పు ఉన్నందున, ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. – అక్షరటుడే, భీమ్‌గల్

- ఆంధ్రాలో ఎనిమిది పశువులకు, ఇద్దరు మనుషులకు సోకిన వైరస్
- తెలంగాణలోని సెమన్ బ్యాంకులపై ప్రత్యేక నిఘా!
- జిల్లాలో పాడి రైతులను అలర్ట్ చేసిన పశుసంవర్ధక శాఖ
- మనుషులకూ పొంచి ఉన్న ప్రమాదం
- జాగ్రత్తలు పాటించాలంటున్న పశువైద్యులు

# 'బ్రూసెల్లోసిస్' కలకలం!

రాష్ట్రంలో పశువుల కృత్రిమ గర్భధారణ కోసం వీర్యాన్ని సేకరించి, భద్రపరిచే కీలకమైన ఘనీకృత వీర్య కేంద్రాలు ప్రధానంగా రెండు చోట్ల ఉన్నాయి. కరీంనగర్‌లో జిల్లాలోని లక్ష్మీపూర్, రంగారెడ్డిలోని రాజేంద్రనగర్‌లో కేంద్రాలను ప్రభుత్వం నెలకొల్పింది. 'కేంద్ర పశు వీర్య సేకరణ కేంద్రం', కరీంనగర్, రాజేంద్రనగర్ కేంద్రాల నుంచే నిజామాబాద్ జిల్లాలోని అన్ని పశువైద్యశాలలకు, ఆర్టిఫీషియల్ ఇన్సెమినేషన్ సెంటర్లకు వీర్యం సరఫరా అవుతుంది. ప్రస్తుతం ఏపీలో వీర్య కేంద్రంలోనే ఈ వ్యాధి బయటపడడంతో.. తెలంగాణలోని కరీంనగర్, రంగారెడ్డి జిల్లాల్లోని సెమన్ బ్యాంకులపై పశువైద్య శాఖ ప్రత్యేక నిఘా పెట్టాల్సిన అవసరం ఏర్పడింది. ఒకవేళ ఇక్కడి ఆబోతులకు వ్యాధి సోకితే, వాటి వీర్యం ద్వారా నిజామాబాద్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వేలాది పశువులకు ఈ వ్యాధి అత్యంత వేగంగా సంక్రమించే ప్రమాదం పొంచి ఉంది.

### మనుషులకూ ప్రమాదమే..

వ్యాధి సోకిన పశువుల పచ్చి పాలను (కాచకుండా) తాగడం వల్ల మనుషుల శరీరంలోకి ఈ బ్యాక్టీరియా చేరుతుంది. పశువులు ఈనే సమయంలో లేదా గర్భస్రావ వ్యర్థాలను చేతులతో నేరుగా తాకడం వల్ల పశువైద్యులకు, గోపాలమిత్రులకు, రైతులకు ఇది సోకే అవకాశం ఉంటుంది. ఈ వైరస్ సోకినట్లయితే మనుషుల్లో విపరీతమైన కీళ్లనొప్పులు, వచ్చిపోయే జ్వరం (అండ్యులెంట్ ఫీవర్), తీవ్రమైన నీరసం, పురుషుల్లో సంతానలేమి సమస్యలు తలెత్తుతాయి.

### పశువుల్లో లక్షణాలు ఇవే..

చూడి (గర్భంతో ఉన్న) ఆవులు, గేదెలు ప్రసవానికి రెండు, మూడు నెలల ముందు (ఆఖరి త్రైమాసికంలో) గర్భస్రావానికి గురవుతాయి. ఈనిన తర్వాత మాయ సులభంగా పడక లోపలే కుళ్లిపోతుంది. దీనివల్ల పశువులు తిరిగి కట్టకుండా శాశ్వతంగా గొడ్డుపోతాయి. ఈ వైరస్ కారణంగా వీర్య సేకరణ కేంద్రాల్లోని ఆబోతులలో వృషణాల వాపు కనిపిస్తుంది. వీటి వీర్యం ద్వారా ఇతర పశువులకు వ్యాధి అత్యంత వేగంగా వ్యాపిస్తుంది.

### రైతులు, పాడి నిర్వాహకులు చేపట్టాల్సిన జాగ్రత్తలు

ఇళ్లలో ఉపయోగించే పాలను తప్పనిసరిగా బాగా మరిగించిన తర్వాతే వాడాలి. పచ్చి పాలు తాగడం అస్సలు శ్రేయస్కరం కాదు. ఇతర ప్రాంతాల నుంచి, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల నుంచి కొత్త పశువులను కొనుగోలు చేసి తెచ్చినప్పుడు.. వాటికి బ్రూసెల్లోసిస్ పరీక్షలు చేయించాకే మందలోకి చేర్చాలి. పశువుల గర్భస్రావ వ్యర్థాలను తొలగించేటప్పుడు చేతులకు గ్లౌజులు, ముఖానికి మాస్కులు తప్పనిసరిగా ధరించాలి. ఆ వ్యర్థాలపై బ్లీచింగ్ పౌడర్ లేదా సున్నం చల్లి గోతిలో పూడ్చిపెట్టాలి.

### అంటువ్యాధి.. చికిత్స లేదు..

'బ్రుసెల్లా' అనే బ్యాక్టీరియా వల్ల సోకే ఈ వ్యాధి పశువుల్లో ప్రాణాంతకంగా మారుతుంది. దురదృష్టవశాత్తూ ఈ వ్యాధి సోకిన పశువులకు శాశ్వత చికిత్స లేదు. ముందస్తు వ్యాక్సినేషన్, కఠినమైన నివారణ చర్యలు మాత్రమే ఏకైక మార్గం.

### పెయ్య దూడలకు టీకాలు..

4 నుంచి 8 నెలల వయసున్న పెయ్యదూడలకు 'బ్రూసెల్లోసిస్' నివారణ టీకాలు (C19 వ్యాక్సిన్) ఇప్పించడం ద్వారా భవిష్యత్తులో ఈ ముప్పును పూర్తిగా తప్పించవచ్చు. జిల్లాలోని పాడి రైతులు తమ పశువుల ఆరోగ్యంపై నిరంతరం నిఘా ఉంచాలని, ఎక్కడైనా గర్భస్రావాల కేసులు నమోదైతే వెంటనే స్థానిక పశువైద్యాధికారులకు సమాచారం అందించాలని అధికారులు సూచిస్తున్నారు.

## కాంగ్రెస్ మండలాధ్యక్షుడికి సన్మానం

**అక్షరటుడే, భీమ్‌గల్ :** మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా రంగు అనిల్ గౌడ్ ఇటీవల నియామకమయ్యారు. ఈ సందర్భంగా బుధవారం మండలానికి వచ్చిన ఆయనకు పచ్చలనడ్కుడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీ నమ్మకాన్ని నిలబెడుతూ అందరినీ కలుపుకొని మండలంలో కాంగ్రెస్ విజయానికి కృషి చేస్తానన్నారు. నాయకులు మాట్లాడుతూ.. మండలంలో పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పచ్చల



నడ్కుడ గ్రామానికి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చేనేత సంఘాల ఎన్నికల సమరానికి సై.. తుది జాబితాలకు ఆమోదం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఉమ్మడి జిల్లాలోని చేనేత సహకార సంఘాల పాలకవర్గాల ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. సంఘాల ఓటరు తుది జాబితాలను సహకార శాఖ అధికారులు సిద్ధం చేసి ఆమోద ముద్ర వేశారు. దీంతో ఎన్నికల ప్రక్రియకు మార్గం సుగమమైంది. ఆర్మూర్, బోధన్, బీబీపేట, దోమకొండ, కామారెడ్డి, పిట్లంలో చేనేత సహకార సంఘాలు ఉండగా, ఆర్మూర్‌లో పట్టు చేనేత సహకార సంఘం కొనసాగుతోంది. చేనేత సహకార సంఘంలో సభ్యుడిగా ఉండి, రూ.300 వాటాధనం చెల్లించిన వారిని మాత్రమే పూర్తిస్థాయి సభ్యులుగా గుర్తించి ఓటు హక్కు కల్పిస్తారు. గతంలో సభ్యుడిగా ఉండి వాటాధనం చెల్లించని వారికి ఏప్రిల్ 17 వరకు అవకాశం కల్పించడంతో పలువురు చెల్లించారు. సవరణల అనంతరం తుది జాబితాలను ప్రక్రియ ప్రకారం ఆమోదించారు. దీంతో ఎన్నికల్లో పోటీ చేయాలంటే సభ్యులు డైరెక్టర్లుగా, ఛైర్మన్లుగా అవకాశం దక్కించుకోవడానికి ఇప్పటికే ప్రచారాన్ని ప్రారంభించారు. తుది జాబితా ప్రకారం నిజామాబాద్ జిల్లాలోని సంఘాల్లో 1,730 మంది, కామారెడ్డి జిల్లాలోని సంఘాల్లో 891 మంది ఓటర్లు ఉన్నారు. ఆర్మూర్ పట్టు సంఘంలో పురుషులు 222, మహిళలు 0, బోధన్‌లో 256, మహిళలు 42, నిజామాబాద్‌లో 679, మహిళలు 175, ఆర్మూర్‌లో పురుషులు 213, మహిళలు



143మంది ఉన్నారు. ఇక కామారెడ్డిలో పురుషులు 56, మహిళలు 1, పిట్లంలో పురుషులు 76, మహిళలు 25, బీబీపేటలో పురుషులు 324, మహిళలు 57, దోమకొండలో పురుషులు 288, మహిళలు 64 మంది ఓటర్లుగా నమోదయ్యారు. తుది జాబితాల ప్రకటనతో ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన తుది ప్రతిపాదనలను రాష్ట్ర సహకార ఎన్నికల అధికారులకు పంపుతామని సహాయ సంచాలకులు, చేనేత, జౌళి శాఖ, కామారెడ్డి ఎం.సాగర్ తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటన కోసం అభ్యర్థులు, సభ్యులు ఎదురుచూస్తున్నారు. ఉత్సాహవంతులైన సభ్యులు తమ సంఘ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడానికి ఆసక్తి చూపుతున్నారు. తుది జాబితాలను సంఘాల నోటీసు బోర్డుల్లో ప్రదర్శించారు.

## ఇందల్వాయి చెరువు శిఖం పరిశీలన

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** ఇందల్వాయి పెద్ద చెరువు శిఖం భూమిని తహశీల్దార్ బాలయ్య, రెవెన్యూ ఇరిగేషన్ శాఖ అధికారులు పరిశీలించారు. కబ్జాకు గురైన చెరువు శిఖం సర్వే చేయాలని అధికారులకు గ్రామస్థులు ఫిర్యాదు చేయగా వారు స్పందించి బుధవారం సర్వే చేశారు. పెద్ద మొత్తంలో భూమి కబ్జాకు గురైందని అధికారులు నిర్ధారించారు. చెరువు ఆనుకుని ఉన్న రైతులందరికీ త్వరలోనే నోటీసులు జారీచేసి సర్వే చేసిన అనంతరం చెరువు చుట్టూ హద్దులు ఫిక్స్ చేస్తామని తహశీల్దార్ స్పష్టం చేశారు. రైతులందరూ నోటీసులు తీసుకున్న తర్వాత వారి సమక్షంలోనే సర్వేలు చేస్తామని, ఇందుకు రైతులందరూ సహకరించాలని పేర్కొన్నారు. ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, నాయకులు లోకాని గంగారాం తదితరులు ఉన్నారు.

## తప్పుల్లేని ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** తప్పుల్లేని ఓటర్ల జాబితా రూపకల్పనకు రాజకీయా పార్టీలు సహకరించాలని ఆర్డీవో ప్రభాకర్ అన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ షెడ్యూల్ గురించి అధికారులు, నాయకులకు ఆర్డీవో వివరించారు. ఇంటింటి సర్వే, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు, డూప్లికేట్ ఓట్ల గుర్తింపు వంటి విధి విధానాలను క్షుణ్ణంగా తెలియజేశారు. పూర్తి పారదర్శకంగా, లోపాలు లేకుండా జరగాలని సూచించారు. ప్రతి పోలింగ్ బూత్‌కు ఒక బూత్ లెవల్ ఏజెంట్ బీఎల్ఏను నియమించి, వారి వివరాలను త్వరగా అందజేయాలని పార్టీల ప్రతినిధులకు ఆర్డీవో సూచించారు. బీఎల్ఏలు బూత్ లెవల్ అధికారులతో సమన్వయం చేసుకొని ఓటర్ల జాబితా సవరణలో కీలకంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో ఎల్లారెడ్డి తహశీల్దార్ ప్రేమ్, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్, ఎన్నికల విభాగం సిబ్బందితో పాటు ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.



## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి




**అక్షరటుడే, ఆర్మూర్:** మత్తు పదార్థాలకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని ఆర్మూర్ ఎస్సై రజనీకాంత్ అన్నారు. ఆర్మూర్ మండలం మగ్గిడి గ్రామంలో బుధవారం 'మన ఊరు – మన భద్రత మన బాధ్యత' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని, మైనర్లకు వాహనాలను ఇవ్వకూడదన్నారు. ప్రతి ఒక్కరూ వాహన లైసెన్స్ పత్రాలు కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేష్, వార్డు మెంబర్లు ఐకేపీ మహిళా సంఘాలు యువకులు, షీటీం సభ్యులు పాల్గొన్నారు.

## డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి ఏడురోజుల జైలు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి ఏడు రోజుల జైలుశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. ఈ మేరకు నిజామాబాద్ రూరల్ ఎస్‌హెచ్‌వో వివరాలు వెల్లడించారు. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి మద్యం సేవించి బొలెరో వాహనం నడుపుతున్న యోగేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని కోర్టులో హాజరుపర్చారు. విచారణ చేసిన న్యాయమూర్తి ఏడు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తున్నట్లు తీర్పు ఇచ్చారు. ఈ సందర్భంగా నిజామాబాద్ రూరల్ ఎస్‌హెచ్‌వో మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## శివాలయంలో చోరీ..



**అక్షరటుడే, కామారెడ్డి:** రామారెడ్డి మండలం పోసానిపేట గ్రామంలోని శివాలయంలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామ శివారులో ఉన్న శివాలయానికి ప్రతిరోజు లాగే పూజారి తాళం వేశారు. అయితే రాత్రి ఇద్దరు వ్యక్తులు ఆలయంలోకి చొరబడి గర్భగుడిలో ఉన్న హుండీలో నుంచి సుమారు రూ.30 వేల నగదు, ఆలయంలోని అమ్మవారి పుస్తెమట్టెలు దోచుకెళ్లారు. ఈ దృశ్యాలు ఆలయంలోని సీసీ కెమెరాల్లో స్పష్టంగా రికార్డయ్యాయి. అయితే చోరీకి పాల్పడింది గ్రామానికి చెందిన వారేనా.. ఇతర ప్రాంతాల వ్యక్తులా తేలాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.